


**త్వరలో వందేభారత్ స్లీపర్స్**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 235 మంగళవారం 9 డిసెంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## రాజ్యసభలో ఇండిగో రగడ

**ఇండిగో సంక్షోభానికి ఆ సంస్థలోని అంతర్గత సమస్యలే కారణం: రామ్మోహన్ నాయుడు**

న్యూఢిల్లీ, **డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగో సంక్షోభంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఇది పూర్తిగా ఇండిగో సంస్థ అంతర్గత సమస్యల వల్లే తలెత్తిందని, ప్రభుత్వ నిబంధనల వల్ల కాదని ఆయన స్పష్టం చేశారు. మిగతాది 2లో..




# 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

## తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి**

- రాష్ట్ర ఎదుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- కొత్త రాష్ట్రం అయినా అభివృద్ధిలో దూకుడు
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ మా లక్ష్యం
- దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10శాతం ఉండాలనేది ఆశయం
- గాంధీ, అంబేద్కర్ సిద్దాంతాలే తెలంగాణ అభివృద్ధి మార్గదర్శకాలు
- క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ల అభివృద్ధి మోడల్ అమలు
- అభివృద్ధి ప్రయాణంలో గ్లోబల్ ఇన్వెస్టర్లు కీలక భాగస్వాములు
- పెట్టుబడులకు తెలంగాణ అన్ని విధాలుగా అనుకూలం



హైదరాబాద్, డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త్.) : తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ అంటూ రాష్ట్ర ఎదుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొత్త రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. 2047కు సరికొత్త లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగుతున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలనేదే తమ ఆశయమన్నారు. ప్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న ' తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

## మాతృభూమి ఔన్నత్యాన్ని చాటేలా వందేమాతరం

**150 ఏళ్ల ప్రస్థానంపై లోక్‌సభలో మోడీ ప్రసంగం**



- వేదకాలం నుంచి మాతను కొలవడం ఆదర్శం
- అదే స్ఫూర్తితో వందేమాతర గీతం రచన
- దేశ స్వాతంత్ర్యానికి వందేమాతరం ప్రేరణ
- ఈ గీతమే జనప్రవాహాన్ని కదలించింది
- బ్రిటిష్ వారితో పోరాటంలో ముందు నిలిచింది
- కానీ..నెహ్రూ ఈ గీతాన్ని అవమానించాడు
- జిన్నా ఉద్యమానికి తలొగ్గిన నెహ్రూ

న్యూఢిల్లీ, **డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** దేశ స్వాతంత్ర్యానికి వదేమాతర గీతం ప్రేరణ అని ప్రధాని మోడీ అన్నారు. కోట్లాది మంది భారతీయులు ఈ గీతానికి ఉత్తేజితులై స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారని అన్నారు. ఇది దేశానికి ప్రేరణ ఇచ్చిన గీతమని, స్వాంతంత్ర్య సముపార్జనకు నాందిగా మారిందని అన్నారు. లోక్‌సభలో వందేమాతర గీతం 150వ వార్షికోత్సవంపై జరిగిన చర్చలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ చర్చ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ..మిగతాది 2లో..

## 8వ వేతన సంఘంతో కోటి మందికి పైగా లబ్ధి



**50 లక్షల ఉద్యోగులు, 69 లక్షల పెన్షనర్లకు ప్రయోజనం**

**పే కమిషన్ అమలుపై లోక్‌సభలో కేంద్రం స్పష్టత**

**సిఫార్సుల ఆమోదం తర్వాత నిధులు కేటాయిస్తామని వెల్లడి**

న్యూఢిల్లీ, **డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా 50 లక్షల మందికి పైగా ఉద్యోగులు, దాదాపు 69 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారని సోమవారం పార్లమెంటుకు తెలియజేసింది. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకుమిగతాది 2లో..

## అట్టహాసంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

**సమ్మిట్‌ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

**వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్**

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్ష**

హైదరాబాద్,**డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** నెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా ప్రారంభమైంది. సమ్మిట్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. సోమవారం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ వర్మ మాట్లాడుతూ..మిగతాది 2లో..



## రేవంత్‌ది ప్రైవేట్ లిమిటెడ్ పాలన

- రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్
- అబద్ధాలే ఆయన శ్వాసగా పాలన
- రెండేళ్లుగా దోపిడీ తప్ప పారదర్శకత ఏదీ
- రెండేళ్ల పాలనపై బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్, **డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్ అని, ఆయన ఏం మాట్లాడినా అబద్ధమే అంటూ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రెండేండ్ల పాలనలో దోపిడీ తప్ప పారదర్శక లేదని, ఆత్మస్తుతి, పరనింద తప్ప రేవంత్ చేసిందేమీ లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రిది ప్రైవేట్ లిమిటెడ్ పాలన అని, మిగతాది 2లో..



## హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం

**ఐటి, ఇన్నోవేషన్, ఫార్మా, ఏరోస్పేస్ టెక్నాలజీలకు కేంద్రం**

**హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీనిపెంచేందుకు కలసికట్టుగా కృషి**

**రాష్ట్రాల సహకారంతోనే వికసిత భారత్ కల సాకారం**

**ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరణ**

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్,**డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్ కేవలం ఓ రాష్ట్రానికి రాజధాని నగరం కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం లాంటిదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఐటీ హబ్‌గా, ఇన్నొవేషన్ కారిడార్‌గా, ఫార్మాసూటికల్ క్యాపిటల్‌గా, ఏరోస్పేస్ టెక్నాలజీ సెంటర్‌గా వర్ధిల్లుతోంది. ఈ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని మరింత పెంచేందుకు అందరమూ కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. 2047 నాటికి మన దేశం వికసిత భారత్‌గా వెలుగొందాలని తరచూ ప్రధాని మోదీ పిలుపునిస్తూ ఉంటారు. అయితే రాష్ట్రాల సహకారంతోనే మిగతాది 2లో..



## ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

**క్యాట్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే**




హైదరాబాద్,**డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** ఏఎస్ అధికారి ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆమ్రపాలికి సూచించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఆమ్రపాలిని ఏపీకి కేటాయిస్తూ గత ఏడాది అక్టోబర్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ డీవోపీటీ ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని ఆమె క్యాట్‌లో సవాలు చేశారు. దీంతో ఆమ్రపాలిని తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో క్యాట్ ఉత్తర్వులను డీవోపీటీ మళ్లీ హైకోర్టులో అప్పీలు చేసింది. ఆమ్రపాలికి స్వాపింగ్ వర్తించదని డీవోపీటీ వాదించింది. హరికిరణ్ రిజర్వ్ కేటగిరీ కాబట్టి ఆయనతో ఆమ్రపాలికి స్వాపింగ్ వర్తించదని వివరించింది. ఈ క్రమంలో క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్**

**ఫ్యూచర్ సిటీలో వంతారా జూపార్క్ ఏర్పాటు**

**ఏజీఐడీసీ కంపెనీ రూ.70వేల కోట్లతో ఒప్పందం**

**విన్ గ్రూప్‌తో రూ.27వేల కోట్ల ఒప్పందం**

హైదరాబాద్,**డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ఖ్యాతిని ఘనంగా చాటేలా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమిట్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అంతర్జాతీయ, ఆర్థిక సదస్సు కోసం దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు తరలివచ్చారు. రేపటి సమిట్ కోసం ఇంకా పెద్ద సంఖ్యలో ప్రముఖులు తరలి వస్తున్నారు. . భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహిస్తున్న ఈ సమిట్ లో అంచనా కు మించి తెలంగాణ ప్రభుత్వం వివిధ కంపెనీలు, సంస్థలతో ఎంవోయులు చేసుకుంది. సోమవారం ఒక్క రోజే రూ.4 లక్షల కోట్ల 2లో..



# 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలు, అభిప్రాయాలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10శాతం ఉండాలనేది తమ ఆశయమన్నారు.

లక్ష్యం పెద్దది అయినప్పటికీ కష్టపడి సాధిస్తామనే నమ్మకం మాకుంది. అందరి సహకారంతో మా లక్ష్యాన్ని అందుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో తెలంగాణ భవిష్యత్ విజన్‌ను స్పష్టంగా వివరించారు. దేశ భవిష్యత్ కోసం రాజ్యాంగ సభ ఏర్పాటు చేసి భారత రాజ్యాంగ నిర్మాతల దృష్టిని గౌరవించడం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్దాంతాలే తెలంగాణ అభివృద్ధి మార్గదర్శకాలని ఆయన అన్నారు. విడిపోయిన తర్వాత ప్రజా పోరాటంతో సాధించిన ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ 2014లో సోనియా గాంధీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో భారత పటంలో చోటు చేసుకుందని గుర్తు చేశారు. గత దశాబ్దంలో రాష్ట్రం అత్యధిక అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగిందన్నారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికల కోసం నిపుణుల కమిటీ ఏర్పాటుతో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్'ను సిద్ధం చేసినట్లు సీఎం వెల్లడించారు. ఈ డాక్యుమెంట్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపొందించబడిందని, నీతి ఆయోగ్, నిపుణుల సూచనలు ప్రధాన పాత్ర పోషించాయని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడం ముఖ్య లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జనాభాలో 2.9 శాతమే ఉన్నా.. దేశ జిడిపిలో 5 శాతం వాటా సాధించిన తెలంగాణ 2047 నాటికి దాన్ని 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. రాష్ట్ర అభివృద్ధి కోసం మొదటిసారి క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ల అభివృద్ధి మోడల్‌ను అమలు చేస్తున్నామన్నారు. చైనా గ్వాంగ్‌డాంగ్ మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని.. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాల పోటీ స్థాయికి తెలంగాణను తీసుకెళ్లే ప్రణాళిక ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో గ్లోబల్ ఇన్వెస్టర్లు కీలక భాగస్వాములని.. వారికి ఈ సందర్భంగా ఆహ్వానం పలుకుతున్నట్లు సీఎం అన్నారు. కష్టం అయితే వెంటనే చేయండి.. అసాధ్యమైతే డెడ్‌లైన్ పెంచుతాం అని సందేశం ఇచ్చారు. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించాం. వాటిని సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించాం. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నాం. ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో సహకరించిన వారందరికి ఈ

సందర్భంగా సీఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల సూచనలను ఆహ్వానిస్తున్నామన్నారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా భవిష్యత్తుకు రోడ్ మ్యాప్ వేశారని వివరించారు. అలాగే తాము సైతం తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలనుకున్నామన్నారు. తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. రానున్న పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించి.. 2047లో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని.. నాటికి మనం ఏం సాధించామో చెప్పాలని నిపుణులను కోరినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ సమయంలోనే తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతకు బీజం పడిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. మనమేదైనా గొప్పగా చేయాలని భావించినప్పుడు తెలంగాణ సంస్కృతిలో ముందుగా దేవుళ్ల ఆశీర్వాదం తీసుకుంటాం? ప్రజల మద్దతు కోరుతామన్నారు. భవిష్యత్తు కోసం మన కలలు నెరవేర్చుకోవడానికి ప్రజల ఆలోచనలు, అంచనాలు తెలుసుకున్నామన్నారు. అందుకు అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణుల సహాయం తీసుకున్నామన్నారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు రావడం మన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులతోపాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులకు సీఎం రేవంత్ ధన్యవాదాలు చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీ సూచనలు, సలహాలు, అభిప్రాయాలను స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. మంచి సానుకూల వాతావరణం కూడా ఉందన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న రాష్ట్రాన్ని.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని తాము సంకల్పించామని చెప్పారు. దేశంలో తెలంగాణ దాదాపు 2.9శాతం జనాభా కలిగి ఉందని గుర్తు చేశారు. దేశ జీడీపీలో తెలంగాణ నుంచి దాదాపు 5శాతం వాటాను అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి భారత దేశ జీడీపీలో 10 శాతం వాటాను తెలంగాణ నుంచి అందించాలన్నది తమ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. సేవారంగం, తయారీ రంగం, వ్యవసాయ రంగం.. ఇలా తెలంగాణను మూడు భాగాలుగా విభజించి.. ప్రాంతాల వారీగా అభివృద్ధి లక్ష్యాలను నిర్ధేశిరచుకున్నామని వివరించారు. ఇలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మొట్టమొదటిదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అందుకోసం కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ మోడల్స్ నిర్దేశించామని చెప్పారు. ఈ సందర్భంగా చైనాలోని గ్వాంగ్-డాంగ్ ప్రావిన్స్ సాధించిన అభివృద్ధి గురించి సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. చైనాలోనే ఈ ప్రావిన్స్ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని తెలిపారు. 20 ఏళ్లలో వారు ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడులతోపాటు వృద్ధి రేటు సాధించారని వివరించారు. తెలంగాణలో సైతం తాము అదే నమూనాను అనుసరించాలని భావిస్తున్నామని చెప్పారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల నుంచి తామేంతో ప్రేరణ పొందామన్నారు. ప్రస్తుతం ఆయా దేశాలతో తాము పోటీ పడాలనుకుంటున్నామని తెలిపారు. ఈ విజన్ కష్టంగా అనిపించవచ్చు.. కానీ ఆ విజన్‌ను సాధించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమ టీమ్‌కు తాను చెప్పేదొక్కటేనన్నారు. కష్టంగా ఉంటే..వెంటనే చేపడుదాం. అసాధ్యం అని అనుకుంటే.. వారికి కొంత గడువు ఇస్తానని పేర్కొన్నారు. ఇవాళ తాను నిన్నటి కంటే

ఎక్కువ విశ్వాసంతో, నమ్మకంతో ఉన్నానన్నారు. నిన్నటిది ఒక కల, ఒక ప్రణాళిక? ఇవాళ మీరందరూ తమతో చేరారని.. ఈ ప్రయాణంలో భాగస్వాములుగా ఉండాలని ఆశిస్తున్నామన్నారు. మీ అందరి మద్దతుతో తెలంగాణ రైజింగ్ లక్ష్యాలన్నింటినీ సాధించగలమని బలంగా విశ్వసిస్తున్నానన్నారు. ఈ తెలంగాణ రైజింగ్ నిరంతర ప్రక్రియ..అంటూ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తూ.. తన ప్రసంగాన్ని ముగించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం అనంతరం ఈ సమ్మిట్ ప్రారంభ వేడుకలు ముగిశాయి. ఆనంతరం వివిధ రంగాలపై సదస్సులు ప్రారంభమైనాయి. సెమీకండక్టర్ రంగంపై చర్చలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. విద్యా రంగంలో గ్లోబల్ సెంటర్‌గా తెలంగాణ చర్చ గోష్టిలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు.

## రాజ్యసభలో ఇండిగో రగడ

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా రాజ్యసభలో ఎంపీ ప్రమోద్ తివారీ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. "ఇండిగో సంక్షోభాన్ని ప్రభుత్వం తేలిగ్గా తీసుకోవడం లేదు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాం. ఈ సమస్యకు ప్రధాన కారణం ఇండిగో సిబ్బంది రోస్టరింగ్, అంతర్గత ప్రణాళిక వ్యవస్థలో ఉన్న లోపాలే. కొత్తగా తెచ్చిన విమాన సిబ్బంది పనివేళల పరిమితి నిబంధనలతో ఎలాంటి సంబంధం లేదు" అని రామ్మోహన్ నాయుడు వివరించారు. అందరితో చర్చించిన తర్వాతే ఈ నిబంధనలు రూపొందించామని, డిసెంబర్ 3 వరకు సర్వీసులు సజావుగానే నడిచాయని గుర్తుచేశారు. ఈ సంక్షోభం కారణంగా ప్రయాణికులు ఎదుర్కొన్న తీవ్ర అసౌకర్యానికి చింతిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇదే సమయంలో, విమాన టికెట్ ధరలు అడ్డగోలుగా పెంచకుండా ప్రభుత్వం పరిమితులు విధించిందని, ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని సభకు హామీ ఇచ్చారు. అయితే, మంత్రి రామ్మోహన్ నాయుడు ఇచ్చిన సమాధానంతో విపక్ష ఎంపీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యం కూడా ఉందని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ గందరగోళం మధ్య సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ప్రస్తుతం సమావేశాలు కొనసాగుతున్నాయి.

## అట్టహాసంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం దోహదపడుతోందని గవర్నర్ పేర్కొన్నారు. సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు. పెట్టుబడులు, ఉపాధి, ఇన్నోవేషన్ ప్రధాన లక్ష్యంగా 27 అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సదస్సును ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ...నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ ముందుకెళ్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెల్లడించారు. వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్ కొనసాగుతోందన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. మహిళా రైతులను పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో స్థిరమైన, పారదర్శకమైన ప్రభుత్వం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వివరించారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని నోబెల్ అవార్డు గ్రహీత కైలాశ్ సత్యార్థి తెలిపారు. తెలంగాణ ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో 20 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని చెప్పారు. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. సంస్కృతి,కళలు,టెక్నాలజీ,పరిశ్రమల హబ్‌గా తెలంగాణ ఉందన్నారు. ఐకమత్యంతోపాటు శాంతియుత పరిస్థితులతోనే అభివృద్ధి సాధ్యమని కైలాశ్ సత్యార్థి వివరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సోమవారం ప్రారంభమైంది. ఈ సమ్మిట్ మంగళవారంతో ముగియనుంది. ఈ సమ్మిట్‌కు సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు కేంద్ర మంత్రులు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తోపాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. దాదాపు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు, అతిథులు ఈ సమ్మిట్‌కు హాజరయ్యారు. దేశ, విదేశీ ప్రముఖులు ఈ సమ్మిట్‌కు హాజరయిన నేపథ్యంలో భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు.

## మాతృభూమి ఔన్నత్యాన్ని చాటేలా వందేమాతరం

(మొదటి పేజీ తరువాయి)

బకించంద్ర ఛటోపాధ్యాయ రాసిన వందేమాతర గీతం బెంగాల్‌లో బాగా ప్రాచుర్యం అయినట్లు మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా వార పత్రిక 'ఇండియన్ ఒపినియన్'లో డిఎంబర్ 2, 1905న రాశారు. బెంగాల్ స్వదేశీ ఉద్యమ సమయంలో బకించంద్ర రాసిన పాటను పాడటానికి లక్షలాది మంది ప్రజలు గుమిగూడి భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ పాట ఎంతగా ప్రాచుర్యం పొందింది అంటే.. ఈ గీతమే మన జాతీయ గీతంగా మారింది. ఈ పాట భావాలు గొప్పవి. ఇది ఇతర దేశాల పాటల కంటే తియ్యగా ఉంటుంది. దేశభక్తిని మేల్కొల్పడం దీని ఏకైక లక్ష్యం. ఇది భారతదేశాన్ని తల్లిగా చూస్తుంది' అని అన్నారు. రుగ్వేదంలోని శ్లోకాన్ని, రామాయణంలో రాముడు పలికిన వాక్యాలను ఈ సందర్భంగా ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. దేశమంటే మన మాతృభూమిగా కొలవడం అనాదిగా వస్తోందని, వందేమాతర గీతానికి ఇవే ప్రేరణలని అన్నారు. లోక్‌సభలో వందేమాతరంపై జరుగుతున్న ప్రత్యేక చర్చ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీపై, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ గతంలో జాతీయ గీతాన్ని 'తుక్డే తుక్డే' చేసినట్టు ఆరోపించారు. అలాగే, వందేమాతరంతో ముస్లింలను రెచ్చగొట్టే విధంగా ఉందని నెహ్రూ పేర్కొన్నాడని చెప్పారు. సభలో 'షేమ్ షేమ్' నినాదాలు వినిపించినప్పటికీ, మోడీ వ్యాఖ్యానిస్తూ.. గత శతాబ్దంలో కొన్ని శక్తులు జాతీయ గీతానికి సర్వనాశనం చేశాయని పేర్కొన్నారు. ఆ చరిత్రను వచ్చే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనదేనని ప్రధాని మోడీ అన్నారు. 1937లో మహమ్మద్ అలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్ వందేమాతరానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించిందని ప్రధాని మోడీ గుర్తు చేశారు. అయితే, కాంగ్రెస్, నెహ్రూలు ఆ పోరాటాన్ని ఎదిరించ కుండా, వందేమాతరం పై విచారణకు ఆదేశాలు జారీ చేశారని విమర్శించారు. జిన్నా ఆందోళన తరువాత సుభాష్ చంద్ర బోస్‌కు నెహ్రూ రాసిన లేఖలో- వందేమాతరం మొత్తం చదివిన తరువాత అది ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందని భావిస్తున్నానని ఆయన వెల్లడించారు.

## రేవంత్‌ది ప్రైవేట్ లిమిటెడ్ పాలన

(మొదటి పేజీ తరువాయి)

తన రెండేండ్ల పాలనలో చేసింది ఒక్కటైనా చెప్పగలడా అని ప్రశ్నించారు. ప్రజాభవన్‌ను జల్సాలకు, విందులు, వినోదాలకు ప్రజాభవన్‌ను కేరాఫ్‌గా మార్చారు అంటూ ఘాటు విమర్శలు చేశారు. పార్టీ నేతలతో కలిసి రేవంత్ రెండేండ్ల పాలనపై తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. 'రేవంత్ పాలనలో రెండేళ్లుగా దోపిడీ తప్ప పారదర్శకత లేదు. ఆత్మస్తుతి, పరనింద తప్ప రేవంత్ రెండేండ్లలో చేసిందేమీ లేదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారు. రెండేండ్ల పాలనలో రాష్ట్ర ఆదాయం ఎందుకు తగ్గింది?. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టాం. ఎన్నో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. ప్రతీరోజు ప్రజల్ని కలుస్తానని రేవంత్ రెడ్డి మేనిఫెస్టోలో చెప్పారు. రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఒక్క రోజు మాత్రమే ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. నాలుగైదు రోజులు మంత్రులు వచ్చారు.. ఆ తర్వాత వాళ్లు కూడా పత్తా లేరు. ఆ దరఖాస్తులను పట్టించుకున్న నాథుడే లేడు. మేనిఫెస్టోలోని మొదటి కార్యక్రమం, రేవంత్ రెడ్డి మొదటి మాటే తుస్సుమంది. ప్రజా భవన్‌ను జల్సాలకు, విందులకు, వినోదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు. పొద్దుగాల బ్రేక్‌ఫాస్ట్ మీటింగులు.. మధ్యాహ్నం సెటిల్‌మెంట్లు.. సాయంత్రం గానా భజానాలు, సంగీత్‌లు, ఎంగేజ్‌మెంట్లు, విందులు వినోదాలు జరుగుతున్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన గొడుగు నాగరాజు అనే రైతు తనకు సమస్య ఉందని ప్రజా భవన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అతని ఫోన్‌కు సమస్య పరిష్కారం అయిందని మెసేజ్ వచ్చింది.. కానీ ఇప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. కేసీఆర్ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా తీర్చి దిద్దితే, రేవంత్ రెడ్డి తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నాడు. కేసీఆర్ ప్రతి ఊరికి పల్లె దవాఖానాలు, పెద్ద పెద్ద ప్రభుత్వ హాస్పిటళ్లు కడితే, రేవంత్ రెడ్డి ప్రతి ఊరికి ఒక బారు, పబ్ పెట్టుకోమని చెప్తున్నాడు. ఐటీఐకి, ఐఐటీ, ఐఐఐటీకి తేడా కూడా తెలియని మూర్ఖుడు ఈరోజు ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్నాడు. కళ్యాణలక్ష్మి చెక్కులు తీసుకునేందుకు మహిళలు వారి పిల్లలతో వస్తున్నారు. పెళ్లికి సహాయం చేస్తున్నావా లేక పిల్లల 21వ రోజుకు సహాయం చేస్తున్నావా?. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకానికి ఇవ్వాల్సిన రూ.980 కోట్ల నిధులు పెండింగ్‌లో పెట్టింది. అవినీతి ఎలా చేయాలో కాంగ్రెస్ పాలన చూసి నేర్చుకోవాలి. కరప్షన్ నేర్పడానికి కాలేజీ పెడితే.. తెలంగాణ కాంగ్రెస్ కరప్షన్ పాలనను ఒక సిలబస్ మోడల్‌గా పెట్టొచ్చు.,÷నాన్స్‌లో బిల్లు రావాలి అంటే 30 శాతం ఇవ్వాలి. భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్, ఉత్తమ్, ఆర్ఆర్ ట్యాక్స్ తీసుకువచ్చారు. వ్యవస్థీకృత అవినీతికి కాంగ్రెస్ అధిష్ఠానం బాధ్యత వహించాలి. రెండేండ్లలో నువ్వు జర్నలిస్టులకు చేసింది ఏందన్నారు. . ఒక్క అక్రిడేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. జర్నలిస్టుల సంక్షేమాలకు ఒక్క రూపాయి అయినా ఇచ్చావా' అని హరీశ్ రావు దుయ్యబట్టారు.

## రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులకు ఎంఓయూలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది. ఒక్క పవర్ సెక్టార్ లోనే రెండు లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూ కుదిరింది. ఈ ఓ కీలక ఒప్పందం కుదిరింది. ఫ్యూచర్‌సిటీలో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు గుజరాత్‌లోని వన్యప్రాణుల పునరావస కేంద్రం వంతారా యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వంతారా బృందం ఎంవోయూ కుదుర్చుకుంది. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని సీఎం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మంగళవారం ఐటీ , వినోదం సెక్టార్ లో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ చేసుకోనుంది. తొలిరోజు జరిగిన సమ్మిట్ కు రెండు వందల మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమ్మిట్ కు దేశ ,విదేశాల నుంచి నాలుగు వేల మంది హాజరవుతారని అంచనా. తెలంగాణ రాష్ట్రం మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాల న్నదే తమ ఆశయమని సిఎం స్పష్టం చేశారు. ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో సహకరించిన వారందరికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో దూసుకు పోతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల సూచనలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇదిలావుంటే ఆసియా దేశాలకు చెందిన 2 కీలక కంపెనీలతో ఒప్పందాలు జరిగినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. సింగపూర్‌నకు చెందిన ఏజీఐడీసీ కంపెనీ రూ.70వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. ఈ సంస్థ ఏఐ ఆధారిత డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తుందన్నారు. వియత్నాంకు చెందిన విన్ గ్రూప్‌తో రూ.27వేల కోట్ల ఒప్పందం జరిగిందన్నారు. ఈ సంస్థ రాష్ట్రంలో సోలార్‌ప్లాంట్లు, ఈవీ, ఎనర్జీ స్టోరేజీ ఏర్పాటుచేయనుంది. ఆసియా దేశాలతో ఆర్థిక భాగస్వామ్యంపై గ్లోబల్ సమ్మిట్‌లో చర్చ జరిగింది. ఈ చర్చలో సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం ప్రతినిధులు పాల్గొన్నారు. విన్‌గ్రూప్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ ఏర్పాటు చేయనుందని మంత్రి ఉత్తమ్ వివరించారు. టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటివాటిపై దృష్టి సారిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. మరోవైపు ఫ్యూచర్ సిటీ ప్రాంగణంలో ఒలెక్ట్రా ఎలక్ట్రికల్ కారును సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. స్వయంగా ఆయన కారు నడిపారు.

## 8వ వేతన సంఘంతో కోటి మందికి పైగా లబ్ధి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. 8వ వేతన సంఘం అమలు ఎప్పటి నుంచి ఉంటుంది, దాని విధివిధానాలు, 2026-27 బడ్జెట్‌లో నిధుల కేటాయింపు వంటి అంశాలపై సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, పే కమిషన్ అమలు తేదీని ప్రభుత్వమే నిర్ణయిస్తుందని తెలిపారు. వేతన సంఘం ఏర్పాటైన నాటి నుంచి 18 నెలల్లోగా తన సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వేతన సంఘం సిఫార్సులను పరిశీలించి, ఆమోదించిన తర్వాత వాటి అమలుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని పంకజ్ చౌధరి హామీ ఇచ్చారు. "ఆమోదించిన సిఫార్సుల అమలుకు ప్రభుత్వం తగినన్ని నిధులను అందుబాటులో ఉంచుతుంది. సిఫార్సుల రూపకల్పనకు సంబంధించిన పద్ధతులు, విధివిధానాలను కమిషనే రూపొందిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 3న 8వ వేతన సంఘాన్ని అధికారికంగా ఏర్పాటు చేసినట్లు, దాని విధివిధానాలను కూడా ఖరారు చేసినట్లు ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లు, ఇతర సేవా నిబంధనలకు సంబంధించిన అన్ని అంశాలను ఈ కమిషన్ పరిశీలించి, సిఫార్సులు చేస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ గతంలోనే స్పష్టం చేసింది.

## హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కల సాకారమవుతుందని ఆయన అన్నారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అనేక విషయాలపై మాట్లాడారు. హైదరాబాద్ నగరం అంటేనే సాంకేతికతో సంప్రదాయం, శాస్త్ర పరిజ్ఞానంతో ఆధ్యాత్మికత, వారసత్వ సంపదతో సృజనాత్మకత కలగలిసి ఉంటాయని అన్నారు. తెలంగాణ ఏర్పడిన 2014లోనే మార్పు, పారదర్శకత నినాదంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరించింది. పేదరిక నిర్మూలన, డిజిటల్ సాధికారత, వడివడిగా మౌలికవసతుల కల్పన, రైతుల సంక్షేమం, స్టార్టప్స్ కు ప్రోత్సాహం ఇలా అన్ని రంగాల్లో మున్ముందుకు సాగిపోతోందన్నారు. పరిశ్రమలను, స్టార్టప్స్ ను, టాలెంట్ ను, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో రాష్ట్రాలు పోటీ పడాలి. రాష్ట్రాల మధ్య సుహృద్భావ పోటీతోనే ప్రమాణాలు పెరగడంతో పాటు సంస్కరణలకు వీలు కలుగుతుందని.. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలియచేశారు. 2014 నుంచి 25 వరకు 748.78 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు దశాబ్దంతో పోలిస్తే ఏకంగా 143 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పాలన పెరిగింది. దీంతో పెట్టబడిదారుల్లో నమ్మకం పెరిగింది. భారత్‌ను పెట్టుబడులకు సురక్షితమైన దేశంగా అంతర్జాతీయ పెట్టుబడిదారులు భావిస్తున్నారు.

# సాఫ్ట్ వేర్ కొలువు వదిలి సర్పంచ్ బరిలో



**-సర్పంచ్ బరిలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి**

**-తండ్రి ఆశయ సాధనకు ఎన్నికల బరిలో తనయుడు**

**- 20 హామీల ఎన్నికల మేనిఫెస్టో తో ఎన్నికల ప్రచారం**



**రుద్రూరు/డిసెంబర్8 (జర్నలిస్ట్ వార్త):** లక్షన్నర జీతం వదిలి ఓ యువకుడు గ్రామ సేవ చేయడానికి వచ్చాడు. దీనిలో భాగంగా గ్రామ సర్పంచ్ పదవి కోసం నామినేషన్ దాఖలు చేశాడు. మొన్నటి వరకు సాఫ్ట్ వేర్ కొలువు చేసిన ఈ యువకుడు గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రచారం చేస్తున్నాడు. బాన్సువాడ నియోజకవర్గంలోని రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామానికి చెందిన షేక్ అఫ్సర్ అంబం గ్రామ సర్పంచ్ పదవికి జనరల్ రిజర్వేషన్ కావడంతో తన ఉద్యోగానికి రాజీనామా చేసి స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో నిలిచాడు. తన తండ్రి షేక్ అల్లావుద్దీన్ ప్రోత్సాహంతో మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామంలోని పిల్లలకు విద్యాబుద్ధులు, గ్రామస్తులకు మెరుగైన వైద్యం, సిసి రోడ్లు, డ్రైనేజీలు, గ్రామంలో ఉన్న పురాతన దేవాలయాలను పునర్నిర్మాణం, ధూప దీప నైవేద్యములు, గ్రామస్తులందరికీ ఉచితంగా ఫిల్టర్ వాటర్ సౌకర్యం, గ్రామంలో ఏ కుటుంబంలోనైనా ఆడపిల్ల జన్మిస్తే 5000 కానుక, ఆడపిల్ల పెళ్లి కానుక 5111 రూపాయలు, పాఠశాలల అభివృద్ధి, పిల్లలకు పుస్తకాలు సాంకేతిక పరిజ్ఞానం కంప్యూటర్లతో ల్యాబ్ కోసం ఆధునికరణ పరికరాల ఏర్పాటు, అంబం గ్రామపంచాయతీ సర్పంచ్ గా గెలిస్తే వచ్చే ప్రతి నెల జీతం గ్రామ అభివృద్ధికి ఉపయోగిస్తానని ఇలా మొత్తం 20 పాయింట్లతో కూడిన ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశాడు. అంబం గ్రామపంచాయతీ ప్రజలందరూ తనను ఆశీర్వదించి దీవించి ముందుకు పంపిస్తే పది తరాలు గుర్తుండే విధంగా గ్రామ అభివృద్ధి చేసి చూపిస్తానని యువకుడు ధీమా వ్యక్తం చేస్తున్నాడు. కులం, మతం పేరుతో ఓట్లు అడగడానికి రాలేదని గ్రామం అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చినట్టు మీడియాకు వెల్లడించాడు. అటు గ్రామస్తులు యువకులు మాట్లాడుతూ లక్షల జీతం వదిలి గ్రామం కోసం వచ్చి 24 గంటలు గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ యువతకు గ్రామ ప్రజలకు బాసటగా నిలుస్తున్నారని పలువురు గ్రామస్తులు యువకులు తెలియజేశారు. జిల్లాలో ఈ మేనిఫెస్టోకు ఎంతో ఆదరణ లభిస్తుంది. సోషల్ మీడియాలో సైతం ఈ యువకుడి ఎన్నికల మేనిఫెస్టో చూసి పలువురు అభినందిస్తున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం చదువుకున్న యువకులను గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి దిశలో ముందుకు




తీసుకువెళ్తారని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచిగా పోటీ చేసి గెలిచిన తర్వాత ఊరిని లూటీ చేసే వాళ్ళ కంటే ఇలాంటి విజన్ ఉన్న యువకుడిని సర్పంచ్ గా గెలిస్తే గ్రామం తప్పక అభివృద్ధి చెందుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

# అన్న మా అవ్వను గెలిపించండి..

**- ఉంగరం గుర్తు పై ఓటు వేసి గెలిపించండి.**

**- తల్లిని సర్పంచ్ గా గెలిపించేందుకు తనయుడి కృషి**



**రుద్రూరు/డిసెంబర్8 (జర్నలిస్ట్ వార్త):** బొప్పాపూర్ గ్రామస్తులందరూ ఒకసారి ఆశీర్వదించండి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బొప్పాపూర్ సర్పంచ్ అభ్యర్థి పట్ల దేవ్ బాయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి విషయంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ముందుకు వెళ్తానని ఆమె తెలిపారు. ఒక ఆశయంతో సర్పంచ్ గా బరిలోకి వచ్చానని అందరూ ఆశీర్వదించి ఉంగరం గుర్తుపై ఓటు వేసి తనను ఆదరించి అధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మరోవైపు ఆమె తనయుడు పట్ల శ్రీకాంత్ రుద్రూర్ మండలంలో యువ నేతగా క్రియాశీలక పాత్ర పోషించి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్నాడు. ముందు నుంచే సర్పంచ్ గా పోటీ చేద్దామనే ఆశయంతో ఉన్న శ్రీకాంత్ కు గ్రామంలో రిజర్వేషన్ జనరల్ రాకపోవడంతో తల్లిని సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయించి ప్రతి ఒక్కరి ఇంటికి వెళుతూ ప్రచారాన్ని సాగిస్తున్నాడు. కంటపడ్డ ప్రతి ఒక్కరికి మాట్లాడుతూ మా అమ్మని గెలిపించండి అని అభ్యర్థిస్తున్నాడు. గ్రామంలో ప్రస్తుతం ఎవరి ఇంటికి వెళ్లి ఓటు అడిగినా మంచి స్పందన వస్తుందని శ్రీకాంత్ తెలియజేశాడు. బొప్పాపూర్ సర్పంచ్ గా అత్యధిక మెజార్టీతో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశాడు. ఉంగరం గుర్తుపై ఓటు వేసి తన తల్లిని గెలిపిస్తే గ్రామస్తులకు 24 గంటలు అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇస్తున్నాడు. తల్లి గెలుపు కోసం కొడుకు కృషిని చూసి పలువురు అభినందిస్తున్నారు.

# నాయకుడిగా కాదు మీ సేవకుడిగా పని చేస్తా

**- ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా - ఉంగరం గుర్తు పై ఓటు వేసి గెలిపించండి**

**-అంబం గ్రామ సర్పంచ్ అభ్యర్థి అత్మూరి మహేష్**



**రుద్రూర్/డిసెంబర్ 8, (జర్నలిస్ట్ వార్త):** గ్రామానికి నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని అంబం గ్రామ సర్పంచ్ అభ్యర్థి మహేష్ అన్నారు. సోమవారం గ్రామంలోని ఓటర్లను కలిసి ఆయన మాట్లాడారు. గ్రామస్తులందరూ ఒకవైపు ఆదరించి ఆశీర్వదించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రచార సమయంలో ఓటర్లు తనను ఎంతగానో ఆదరిస్తున్నారని, గెలుపు ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఉంగరం గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో తనను గెలిపించాలని ఓటర్ మహాశయులకు ఆయన కోరారు. గ్రామంలోనే ఉంటూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నాయకుడిని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ గా తనను గెలిపిస్తే గ్రామ ప్రజలకు మరింత సేవ చేసుకుంటానని ఆయన తెలిపారు.

# వెంకటేశ్వర్ రెడ్డి కి నివాళులర్పించిన జక్కంపూడి కిషోర్



**తల్లాడ/డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నెం వెంకటేశ్వరరెడ్డి ,సోమవారంఅనారోగ్య కారణం వల్ల మృతి చెందడం జరిగింది. సోమవారం వారి పార్థివ దేహానికి పూలమాలు లేసి జక్కంపూడి కిషోర్నివాళులర్పించారు. వారిఅకాల మరణం అందరికీ తీరని లోటు వారి పవిత్రమైన ఆత్మకు ఆ దేవుని దగ్గర శాంతి చేకూర్చాలని ఆ భగవంతుని మనసారా కోరుకుంటున్నాంమన్నారు. ఈ సందర్భంగా వారి వెంట మండలం కాంగ్రెస్ పార్టీ వైరా మార్కెట్ కమిటీ మాజీ దుండేటి వీరారెడ్డి ,నున్న శ్రీనివాసరావు, రాయల గోవిందు, కోడూరి రాము,తదితర నాయకులు ఉన్నారు.

# బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచ్‌లను గెలిపించండి

**- అభివృద్ధి నా బాధ్యత : హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**







**హుజురాబాద్/డిసెంబర్8 (జర్నలిస్ట్ వార్త):** మోసపోతే గోసపడతామని కేసీఆర్ చెప్పిన విధంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నడుస్తుందని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. సోమవారం సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలం గూనిపర్తి, శ్రీరాములపల్లి, అంబాల, గూడూరు, భీంపల్లి గ్రామాల్లో జరిగిన రోడ్‌షోల్లో ఆయన మాట్లాడుతూనేను ఈ ప్రాంతం నాయకుడినే అని చెప్పుకునే ఒక ప్రజా ప్రతినిధి, ఒక్కసారి ఈ ప్రాంతంలో ఓడిపోగానే వేరే ప్రాంతాల నుంచి పోటీ చేసేందుకు వెళ్లాడు.కానీ నేనుఈ ప్రాంతాన్ని పట్టుకుని, ప్రజా సమస్యలపై పోరాడిన వ్యక్తిని.వేరే ప్రాంతం నుంచి వచ్చి "మీ నాయకుడ్ని" అని చెప్పే వారిని ప్రజలు నమ్మకూడదని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ వచ్చాక రాష్ట్ర ప్రజలకు కష్టాలు తప్పట్లేదని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలతో అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్లారని తెలిపారు.

రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటుతో రైతును రాజు చేశారని గుర్తు చేశారు.

కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలన్నీ నిలిపివేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలే ఇప్పటికీ నడుస్తున్నాయని తెలిపారు.కళ్యాణలక్ష్మి రూపాయలు 1,16,000తోపాటు తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం కూడా క్యూ లైన్లు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

# మార్పు కోసం మా ప్రయత్నం

**గ్రామపంచాయతీ స్వతంత్ర అభ్యర్థి రమాదేవి, ఊటుకూరి గణేష్ వెల్లడి,**



**కొనిజర్ల/డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** కొనిజర్ల మండలం పెద్దగోపతి పంచాయితీ స్వతంత్ర అభ్యర్థిగా పిడియాల రమాదేవి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని గ్రామంలో ప్రజలని కోరారు కుల వివక్షత పై వారు మాట్లాడుతూ కుల వివక్షత వర్ధిల్లుతుందని కుల అహంకారంతో అగ్ర నాయకులు అధికారం చాలా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు గ్రామంలో చదువుకోని వాళ్ళు ఈరోజు రాజకీయం నడిపిస్తుంటే, చదువుకొని విద్యావంతులుగా ఉన్న నేను గ్రామ అభివృద్ధిలో పోటీ పడాలని ఉత్సాహంతోనే నామినేషన్ దాఖలు చేయడం జరిగింది అన్నారు పెద్దగోపతి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల్లో కులానికి మరియు కలానికి మధ్య యుద్ధం జరగబోతుందని దానికి ప్రజలు ఎటువైపు నిలబడతారు తెలుసుకోవాలన్నారు కుల మతాలను ప్రోత్సహించే రాజకీయాలను యువత ఈ ఎన్నికల ద్వారా తిప్పుకొట్టాలన్నారు మాలో కలిగిన ఈ చైతన్యం రేపటి రేపటి యువతకు ఆదర్శంగా నిలవడానికి మా ఈ ప్రయత్నం అని వారు గ్రామంలో ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ ఉంగరం గుర్తు పై ఓటు వేయాలని ఓటర్లను కోరారుయువత రాజకీయాలకు వచ్చినప్పుడే దేశ అభివృద్ధి జరుగుతుంది. స్వతంత్ర అభ్యర్థి పిడియాల రమాదేవి కి అంబేద్కర్ యువజన సమైక్య సంఘం అధ్యక్షులు కోల నవీన్ కుమార్ కంగ్రాజులేషన్స్ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువతని ప్రధాన పాత్ర అని యువత రాజకీయాలకు వచ్చినప్పుడే దేశ అభివృద్ధి పూర్తిగా జరుగుతుందని అన్నారు కులవ్యవక్షత అంటరానితనం పై యువత పోరాడాలని పిలుపునిచ్చారు రమాదేవి గెలుపుపై యువత ముందుండి ఆమెకు అత్యధిక మెజారిటీ గెలిపించే బాధ్యతను స్థానిక యువత తీసుకోవాలన్నారు వారి యొక్క ప్రచార కార్యక్రమాల్లో మా సంఘం పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు

# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మంబ్యూరో/డిసెంబర్ 8 (జర్నలిస్ట్ వార్త):** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోడౌన్ లోపలి గోడలపై క్రాక్ లను చూసి, వర్షపు నీటికి చెమ్మ రాకుండా, తడి లేకుండా ఉండే విధంగా చూడాలని వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈవిఎంల భద్రత ముఖ్యమైనదని తెలిపారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఏ ఇ లలిత, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి కోడిరెక్కఉమాశంకర్, బిజెపి పార్టీ ప్రతినిధి జి. విద్యాసాగర్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

# అన్నారుగూడెం మహా కూటమి సర్పంచ్ అభ్యర్థిగా గొడ్ల ప్రభాకర్



**తల్లాడ/డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** మహాకూటమి బలపరిచిన ( దొడ్డ శ్రీనివాసరావు గారు మాజీ ఎంపీపీ, కొమ్మినేని వెంకటేశ్వరరావు సీనియర్ నాయకులు (కేవీ ),మాజీ ఎంపీటీసీ గోవిందు విజయమ్మ,మాజీ ఉపసర్పంచ్ గోవిందు భాగ్యమ్మ,సీనియర్ నాయకులు బొమ్మగాని నాదం,సిపిఎం పార్టీ నాయకులు పులి వెంకట నరసయ్య పొన్నం కృష్ణయ్య.టిడిపి నాయకులు దుగ్గినేని వెంకటయ్య,బిజెపి నాయకులు ఆపతి వెంకట రామారావు,దొడ్డ చిన్న శ్రీనివాసరావు,సుంకర రోశయ్య,మరి కొంతమంది గ్రామ ప్రముఖుల ఆశీస్సులతో అన్నారుగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా గొడ్ల ప్రభాకర్ ను ప్రకటించడం జరిగింది.

# హనుమాన్ నామస్మరణతో మార్మోగిన బయ్యారం కోదండ రామాలయం.



**బయ్యారం/డిసెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**
బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి దేవాలయంలో హనుమాన్ మాలధారులు చేపట్టిన దీక్ష 41 రోజు పూర్తి చేసుకున్న సందర్భంగా రామాలయంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు.భక్తులు ఇరుముడి కట్టుకొని నృత్యాలు చేసుకుంటూ కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయానికి బయలుదేరారు.రామాలయంలో 32 మంది హనుమాన్ స్వాములకు ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనాచార్యులు ఇరుముడి కట్టి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ తరపున పూర్తి ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో గురుస్వామి నరేష్ స్వామి,నాగు స్వామి,ఆలయ కమిటీ చైర్మన్ గారే కృష్ణారెడ్డి,సెక్రటరీ కొల్ల వెంకటేశ్వరరావు,వైయస్ రెడ్డి,పెద్దినేని వెంకటేశ్వరరావు, తిరుపతిరావు,చల్లగుండ్ల ఉప్పలయ్య,పుసులూరి మాధవరావు,గరిపెల్లి శ్రీనివాస్,ఇతర హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

# ఓటరు చైతన్య కరపత్రాల ఆవిష్కరణ

**-ఆర్ డి ఓ ఉమారాణి**



**నర్సంపేట/డిసెంబర్8 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణం లోని రెవిన్యూ డివిజనల్ ఆఫీస్ (ఆర్.డి.ఓ కార్యాలయం) మరియు "మండల ప్రజాపరిషత్(ఎం.పి.డి.ఓ) కార్యాలయం" లలో వరంగల్ జిల్లా వినియిగదారుల సమాచార కేంద్రం మరియు స్వచ్చంధ సంస్థల ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కరపత్రాల ను ఆర్.డి.ఓ. ఉమారాణి, ఎం.పి.డి.ఓ శ్రీనివాసరావు లు ఆవిష్కహరించినారు.ఈ సందర్భంగా ఆర్డిఓ ఉమారాణి మాట్లాడుతు జరుగబోయే గ్రామ పంచాయితీ ఎన్నికలలో ఓటర్లు అందరూ ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా, స్వచ్ఛంధంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని నిజాయితీ గల గ్రామాల అభివృద్ధికి పాటుపడే నాయకులను ఎన్నుకొని ప్రజాస్వామ్యం ను కాపాడాలని పిలుపు నిచ్చారు.వంద శాతం ఓటింగ్ నమోదు కొరకు ప్రతీ ఓటరు కృషి చేయాలని కోరినారు.ఎంపి.డి.ఓ శ్రీనివాసరావు మాట్లాడుతు గ్రామాలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉదయం ఆరు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకే నిర్వహించడం జరుగుతుందని ఈ విషయాన్నీ ఓటర్లు అందరూ దృష్టిలో పెట్టుకొని ఉదయం నుండే ఓటింగ్ లో పాల్గొని తమ ఓటు హక్కును వినియిగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా అధ్యక్షులు గిరగాని సుదర్శన్ గౌడ్, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు, జిల్లా ఫుడ్ అడ్వైసరీ కమిటీ మెంబెర్ బెజ్జంకి ప్రభాకర్, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్స్ నాగేల్లి సారంగం గౌడ్, మైస వసంత, ఎస్సి,ఎస్టీ వినియోగదారుల కన్వీనర్ బోయిని వెంకటస్వామి, వెంకట్రాంనర్సయ్య మరియు ఆర్.డి.ఓ కార్యాలయ, ఎం.పి.డి.ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

**-వ్యవసాయ అధికారి కే.రాజు**



**బయ్యారం/డిసెంబర్ 8( జర్నలి%ర్% వార్త ):**
మండలంలోని గంధంపల్లిలో ఏర్పాటు చేసిన పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బయ్యారం వ్యవసాయ అధికారి కే.రాజు ఆకస్మికంగా పరిశీలించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆయన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అనే అంశంపై ప్రత్యేకంగా ఆరాతీశారు. తూకం విధానం,తేమ కొలిచే పరికరాల పనితీరు,గన్నీ సంచుల లభ్యత వంటి అంశాలను సమీక్షించారు.సిబ్బంది మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ,ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.సొసైటీ సిబ్బంది రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు...గుర్తుంచుకోవాల్సిందే..

**బయ్యారం/డిసెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**
రోజు రోజుకు ఎన్నికల నిర్వహణ విధానంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే జరిగే ఎన్నికలు,కాలక్రమేణా అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఓటింగ్ విధానం ఓటింగ్ యంత్రం (ఈవీఎం) శ్రీకారం చుట్టిన తొలిదశలో పోటీచేస్తున్న అభ్యర్థి పేరు, గుర్తు మాత్రమే ఉండగా ప్రస్తుతం ఫొటో కూడా ముద్రిస్తుండటంతో ఓటర్లకు ఎంపికలు మరింత సులభమయ్యాయి.అయితే పంచాయతీ ఎన్నికల్లో మాత్రం వేరుగా అనుసరిస్తున్నారు.ముఖ్యం గా బ్యాలెట్ పేపర్ పై అభ్యర్థి పేరు ఉండదు.తెలుగు వర్ణమాల ప్రకారం వరుస సంఖ్య...దీనికి ఎదురుగా సదరు అభ్యర్థికి కేటాయించిన గుర్తు ఉంటుంది.సర్పంచ్,వార్డు సభ్యుల బ్యాలెట్లలో ఇదే విధంగా గుర్తులు మాత్రమే ఉంటాయి.అంటే పోటీ చేస్తున్న అభ్యర్థి పేరు తెలిస్తే చాలనుకుంటే ఇబ్బందే.అందుకే సర్పంచి,వార్డు సభ్యుల అభ్యర్థుల గుర్తులను ఓటర్లు గుర్తు ఉంచుకుంటేనే మీకు ఇష్టమైన వారికి ఓటు వేసే అవకాశం ఉంటుంది.అందుకే గుర్తును తప్పకుండా గుర్తుంచుకోవాల్సిందే.

**గ్రామ పంచాయితి ఎన్నికల నమూనా బ్యాలెట్ పత్రము - 2025**

సి.పి.ఐ., సి.పి.ఎం. పార్టీలు బలపరిచిన బయ్యారం గ్రామ పంచాయితీ కాంగ్రెస్ పార్టీ 6వ వార్డు అభ్యర్థినిగా

శ్రీమతి **తిరుమల స్వర్ణలత** గారి

స్టూల్ గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరని ప్రార్థన.

| క్రసం. | అభ్యర్థి పేరు | గుర్తు |
|---|---|---|
| 1. | | |
| 2. | | |
| 3. | తిరుమల స్వర్ణలత | |
| 4. | | |
| 5. | NOTA | |

పోలింగ్ తేది : 14-12-2025, ఆదివారం.
సమయం : ఉ॥ 07 గం॥ల నుండి మ॥ 01 గం॥ వరకు
**స్టూల్ గుర్తుకే మన ఓటు.**

# గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు బంద్

**: పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ఖమ్మంబ్యూరో/ డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):**
డిసెంబర్ 11, 14, 17 తేదీలలో జరిగే మూడు విడతల గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఆయా మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.
డిసెంబర్ 11 న జరిగే మొదటి విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 9 వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 11న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలన్నారు.అదే విధంగా డిసెంబర్ 14 న జరిగే రెండో విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 12 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 14న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని సీపీ అన్నారు.డిసెంబర్ 17 న జరిగే మూడో విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 15 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 17న ఎన్నికల ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి,తల్లాడ, వేంసూర్,సింగరేణి మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని సీపీ తెలిపారు.మద్యం దుకాణాలతో పాటు పై తేదీలలో ఆయా మండలాల్లో వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, మూసివేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలలో భాగంగా మూసివేయాలని ఆయన సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం

**- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వి ని రెడ్డి**







**రాయపర్తి/డిసెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**గత పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ మాదిరిగా మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.సోమవారం మండలంలోని జయరాం తండా (కె), బురహాన్ పల్లి, కాట్రపల్లి, పన్యా నాయక్ తండ, వెంకటేశ్వర పల్లి, సన్నూరు, జయరాం తండా (ఎస్), కొండాపురం, జగన్నాధపల్లి, మైలారం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల ప్రచారంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందించి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గ్రామ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అన్నారు. తను ఎమ్మెల్యే అయిన రెండు సంవత్సరాలలోనే నియోజకవర్గానికి 2000 కోట్ల నిధులు తీసుకువచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,మండల నాయకులు మాచర్ల ప్రభాకర్,కుందూరు గోపాల్ రెడ్డి, ఎనగందుల మురళి, నంగునూరి అశోక్, ఉల్లెంగుల యాదగిరి, గబ్బెట బాబు,కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు జాటోత్ స్వరూప, కూస కవిత కుందూరు ఉమా,నేతావత్ హరిణి, షీల హేమలత, సంకినేని సారయ్య, చెడుపాక యాకమ్మ,గుగులోత్ జగన్,కనుకుంట్ల మంజుల,బద్దం సుగుణ,చిర్ర వేణు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్**




**ఖమ్మంబ్యూరో/డిసెంబర్8 (జర్నలిస్ట్ వార్త):**
ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కం న్యాయ సేవా సదన్ చైర్మన్ జీ. రాజగోపాల్ అన్నారు.
రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలనుసారం సోమవారం న్యాయ సేవా సదన్ లో ఇంచార్జ్ కార్యదర్శి ఎం. కల్పన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు, దీనిలో రాజీ పడదగిన అన్ని క్రిమినల్, మోటార్ ప్రమాద, చెక్ బౌన్స్, బ్యాంక్, మనోవర్తి కేసులు, సివిల్ కేసులు ఈ లోక్ అదాలత్ లో పరిష్కరిస్తారని, ఈ లోక్ అదాలత్ లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. మోటర్ ప్రమాద కేసులలో ఇన్సూరెన్స్ కంపెనీలు మానవతా కోణంలో ఆలోచించి త్వరితగతిన నష్టపరిహారం అందించేందుకు కృషి చేయాలన్నారు. కక్షిదారుల విలువైన సమయం, డబ్బు వృధా కాకుండా శాశ్వత అంతిమ పరిష్కారానికి లోక్ అదాలత్ ను ఆశ్రయించాలన్నారు. సివిల్ కేసులలో రాజీ పడడం ద్వారా చెల్లించినటువంటి కోర్టు ఫీజులు సైతం తిరిగి పొందవచ్చు అన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని ఇందులో పరిష్కరించుకుంటే అప్పిలుకు వెళ్లే అవకాశం కూడా లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చట్టం న్యాయంపై అవగాహన లేనివారికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ లో రాజీ పడితే ఇరుపక్షాలు గెలుపొందినట్లే అన్నారు. 695 క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు 450, బ్యాంకు కేసులు 100, భార్యాభర్తలకు సంబంధించిన కేసులు 150, మోటర్ ప్రమాద కేసులో 180, సివిల్ దావాలు 295, ఇతర కేసులు 2000 ఇప్పటి వరకు గుర్తించినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్ ను విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు న్యాయమూర్తి వెంపటి అపర్ణ, అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఇన్సూరెన్స్ న్యాయవాదులు గంగాధర్, సీత రామారావు, రాము, గుప్తా, పోలీసులు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ం

# అధికారంలో ఉన్న లేకున్నా అందరినీ కాపాడుకుంటా

**- బిఆర్ఎస్ అభ్యర్థులను అధిక మెజారిటీ తో గెలిపించాలి - మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.**







**రాయపర్తి/డిసెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):**అధికారం ఉన్న లేకున్నా అందరిని కాపాడుకుంటానని,రాబోయే ఎన్నికల్లో నేనే ఎమ్మెల్యేను,మంత్రిని అవుతానని మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.మండలంలోని పెర్కవేడు,రాగన్న గూడెం,రాయపర్తి,తిర్మలాయపెల్లి,కోలన్ పల్లి,కేశపురం,బురహన్ పల్లి,కాట్రపల్లి తో పాటు పలు గ్రామాలలో స్థానిక సంస్థల బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవతి తల్లి మాటలు నమ్మి, కన్నతల్లి లాంటి దయన్నను మోసం చేశారని ఇప్పుడు పాలకుర్తి ప్రజలు మోసపోయారని తెలుసుకున్నారని అన్నారు. అధికారంలో ఉన్న, లేకున్నా ప్రజాసేవలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు.ఇందిరమ్మ చీరలపై 450 కోట్ల రూపాయలు మహిళా సంఘాల పేరుతో రుణాలు తీసుకున్నారని, 300 విలువ చేసే చీరను 1200 రూపాయలుగా చెబుతూ.. 500 రూపాయలు కమిషన్ రేవంత్ రెడ్డి తీసుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో మహిళలకు 2500, పెన్షన్ పెంపు, కళ్యాణ లక్ష్మి లో తులం బంగారం తో పాటు అనేక హామీలను కాంగ్రెస్ విస్మరించారన్నారు. కెసిఆర్ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలతో తెలంగాణను అభివృద్ధి చేశారన్నారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, ఇన్చార్జి గుడిపూడి గోపాల్ రావు, మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్,మాజి ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజి జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,వివిధ గ్రామాల అభ్యర్థులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు వేసే ముందు ఒకసారి ఆలోచించుకుని వేయ్యాలి...




**సత్తుపల్లి/డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):**
పంచాయతీకి నిజాయితీపరులు, గ్రామాభివృద్ధికి కట్టుబడినవారు, నిష్పాక్షికంగా వ్యవహరించగల సామర్థ్యం ఉన్నవారు, ప్రజల సమస్యలను పరిష్కరించగలగేవారు, నిజాయితీగా విధులు నిర్వర్తించగలవారు అయిన అభ్యర్థిని ఎన్నుకోవాలి. సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి, అభ్యర్థులు నిబద్ధత, అవినీతి రహిత పాలన, పారదర్శకత వంటి లక్షణాలను కలిగి ఉండాలి. పంచాయతీకి నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే నాయకుడు అవసరం. గ్రామాభివృద్ధికి, గ్రామానికి అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇచ్చే అభ్యర్థిని ఎన్నుకోవాలి. అన్ని వర్గాల ప్రజలకు సమానంగా, నిష్పాక్షికంగా వ్యవహరించగల సామర్థ్యం ఉన్నవారు ఉండాలి. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వాటిని పరిష్కరించడానికి కృషి చేసే అభ్యర్థిని ఎన్నుకోవాలి.అవినీతికి తావులేకుండా, నిజాయితీగా తన విధులను నిర్వర్తించే వ్యక్తిగా ఉండాలి. ఈ లక్షణాలు ఉన్న అభ్యర్థిని పంచాయతీకి ఎన్నుకోవడం ద్వారా గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుంది.





# ప్రచారంలో దూసుకు పోతున్న సునీత మహేందర్

## సర్పంచ్ అభ్యర్థి బిర్రు సునీత బ్యాట్ గుర్తు పై ఓటు వేసి గెలిపించండి

## అభివృద్ధి మా బాధ్యత -మాజీ ప్రజా ప్రతినిధుల హామీ

**వర్ధన్నపేట /డిసెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):** సర్పంచ్ ఎన్నికలో రోజు రోజుకు నల్లబెల్లి గ్రామంలో
ప్రచారంలో దూసుకు పోతున్నారు సర్పంచ్ అభ్యర్థి సునీత మహేందర్ లు సోమవారం గ్రామంలోని 12 వార్డుల్లో బిర్రు సునీత మహేందర్ బ్యాటు గుర్తు పై ఓటు వెయ్యాలని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి మాట్లాడుతూ సర్పంచ్ అభ్యర్థి బిర్రు సునీత బ్యాట్ గుర్తు పై ఓటు వేసి గెలిపించండి అంటూ ప్రచారం చేయడం జరిగిందన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటుతో రైతును రాజు చేశారని గుర్తు చేశారు.

కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలన్నీ నిలిపివేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలే ఇప్పటికీ నడుస్తున్నాయని తెలిపారు.కళ్యాణలక్ష్మి రూపాయలు 1,16,000తోపాటు తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు.

కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం కూడా క్యూ లైన్లు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

మహిళలకు రూపాయలు 2500, గ్యాస్‌పై రూపాయలు 500 సబ్సిడీ, వికలాంగులకు రూపాయలు 6000, వృద్ధులకు రూపాయలు 4000 ఇస్తామని హామీ ఇచ్చి ఒక్కటి నెరవేర్చలేదని అన్నారు.బ్యాట్ గుర్తు పై ఓటు వేసి
సునీత ను గెలిపిస్తే గ్రామ అభివృద్ధి మా బాధ్యత అని గ్రామంలోని మాజీ ప్రజా ప్రతినిధుల హామీ ఇచ్చారు.







### మోసపోతే గోసపడతాం... మాధవరావు...

మాజీ ఏం పి టీ సి దుగ్యాల జోతి మాధవరావు మాట్లాడుతూ మోసపోతే గోసపడతామనిసర్పంచ్ గా సునీత మహేందర్ బ్యాటు గుర్తు పై ఓటు వెయ్యాలని ప్రచారం చేయడం జరిగిందన్నారు. కేసీఆర్ చెప్పిన విధంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నడుస్తుందని మాజీ ఏం పి టీ సి దుగ్యాల జోతి మాధవరావు అన్నారు. సోమవారం సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా నల్లబెల్లి గ్రామంలో సునీత గెలుపు కోసం ప్రచారం చెయ్యడం జరిగిందన్నారు.ఈ గ్రామాణి పట్టుకుని, ప్రజా సమస్యలపై పోరాడిన వ్యక్తిని. సునీత మహేందర్ అన్నారు.వేరే ప్రాంతం నుంచి వచ్చి "మీ నాయకుడ్ని" అని చెప్పే వారిని ప్రజలు నమ్మకూడదని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ వచ్చాక ప్రజలకు కష్టాలు తప్పట్లేదని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలతో అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్లారని తెలిపారు.దొంగ హామీలు ఇస్తున్న వారిని నమ్మవదని అభివృద్ధి చేసే సేవకుడు సునీత మహేందర్ మాత్రమే నని గుర్తు చేశారు





### గ్రామ అభివృద్ధి చేసేది సినీత మహేందర్.. మాజీ సర్పంచ్ ముత్యం సంపత్ గౌడ్..

గ్రామ అభివృద్ధి సినీత మహేందర్ అని
మాజీ సర్పంచ్ ముత్యం సంపత్ గౌడ్ అన్నారు.
నల్లబెల్లి గ్రామంలో అభివృద్ధి కోసం మహేందర్ జీవితం ముడి పడి ఉందన్నారు. మహేందర్ మొదట్లో గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ గా, తదుపరి మహిళా సంఘమంలో సి ఏ గా విధులు నిర్వహించడం జరిగిందన్నారు. తాను రెండు మార్లు సర్పంచ్ గా పోటి చేసి ఒడి పొయ్యాడని గుర్తు చేశారు. ఎస్సి మహిళా కావడం తో తనను గ్రామ మాజీ ప్రజా ప్రతినిధుల మంత ఒక్కటై సర్పంచ్ గా నిలబెట్టమని అన్నారు. ఇతర అభ్యర్థులు చేస్తున్న ప్రలోబాలకు గురికవద్దాన్నారు. నిజాయితీ గల నాయకున్ని ఎన్నుకోవాలని వేడుకొన్నారు. నల్లబెల్లి గ్రామాల అభివృద్ధి కోసం బి ఆర్ ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ సునీత బ్యాట్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

### నాయకునిగా కాదు సేవకునిగా పనిచేస్తాడు.. బి జె పి నాయకుడు శ్రీనివాస్...

నాయకునిగా కాదు సేవకునిగా పనిచేస్తాడు బిర్రు సునీత మహేందర్ అని బి జె పి నాయకుడు శ్రీనివాస్ అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలంతా బ్యాటు గుర్తు పై ఓటు వెయ్యాలని ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు.













## నేడు సాయంత్రం 5గంటల నుండి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేంత వరకు మద్యం దుకాణాలు బంద్

### - పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం /డిసెంబర్ 8(జర్నలిస్ట్ వార్త):** డిసెంబర్ 11, 14, 17 తేదీలలో జరిగే మూడు విడతల గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఆయా మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. డిసెంబర్ 11 న జరిగే మొదటి విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 9 వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 11న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలన్నారు.అదే విధంగా డిసెంబర్ 14 న జరిగే రెండో విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 12 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 14న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని సీపీ అన్నారు. డిసెంబర్ 17 న జరిగే మూడో విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 15 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 17న ఎన్నికల ముగిసి, ఓట్ల లెక్కింపు,ఫలితాలు వెల్లడించే వరకు ఏన్కూరు, కల్లూరు,పెనుబల్లి, సత్తుపల్లి,తల్లాడ,వేంసూర్,సింగరేణి మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని సీపీ తెలిపారు.మద్యం దుకాణాలతో పాటు పై తేదీలలో ఆయా మండలాల్లో వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, మూసివేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలలో భాగంగా మూసివేయాలని ఆయన సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామనీ హెచ్చరించారు. నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ కోరారు.

## ధర్మసాగర్ లో మర్రిపెల్లి అనిత భారీ ర్యాలీకి

# ప్రజాదరణ ఊపందింది

### టూత్ పేస్ట్ గుర్తుకు ఓటు వెయ్యాలి

**ధర్మసాగర్/డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మర్రిపెల్లి అనితకు ప్రజామద్దతు రోజురోజుకూ పెరుగుతోంది శనివారం ధర్మసాగర్ ఎస్సీ కాలనీ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన భారీ ర్యాలీ గ్రామంలో చురుగ్దనం సృష్టించింది ర్యాలీకి యువత మహిళలు పెద్దలు భారీగా తరలి వచ్చారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న అనంతరం మర్రిపెల్లి అనిత పూలమాల అర్పించి నివాళులు తెలిపారు. ర్యాలీ మొత్తం మార్గంలో టూత్ పేస్ట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామస్తులను కోరుతూ ప్రచారం కొనసాగింది ర్యాలీ సమయంలో గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా అనితకు మద్దతు తెలపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందిఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి అనిత మాట్లాడుతూ ధర్మసాగర్ అభివృద్ధే తన ఏకైక ధ్యేయమని తెలిపారు. అవినీతికి తావులేని పారదర్శక పాలన అందిస్తానని భరోసా ఇచ్చారు ఎన్నికల్లో డబ్బులు పంచే నాయకులను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. చదువుకున్న యువతిని గ్రామ సర్పంచ్‌గా గెలిపించాల్సిన బాధ్యత ప్రజలదేనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపు సాధిస్తే గ్రామంలో త్రాగునీరు సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా సరిచేస్తానని మాట ఇచ్చారు. వీధి లైట్లు ఏర్పాటు చేసి గ్రామం మొత్తం వెలుగులు నింపుతానని తెలిపారు. గ్రామ పరిశుభ్రతకు ప్రత్యేక



ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. అంతర్గత రహదారులను అభివృద్ధి చేసి ధర్మసాగర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ర్యాలీలో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొనడం ఎన్నికల వాతావరణాన్ని మరింత ఉత్కంఠభరితంగా మార్చింది.







### ఎమ్మెల్యే ప్రివిలేజ్ వ్యవహారం

## ఎమ్మెల్యేల పట్ల అగౌరవం తగదని కమిటీ హెచ్చరిక

**అమరావతి, డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** అసెంబ్లీ కమిటీ హాల్‌లో ప్రివిలేజ్ కమిటీ సోమవారం భేటీ అయ్యింది. ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ పితాని సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి విషయంలో ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంపై కమిటీ విచారించింది. రిమ్స్‌లో క్యాథ్లాబ్ ప్రారంభోత్సవ శిలా ఫలకంలో ఎమ్మెల్యే పేరు లేకపోవడంపై చర్చ జరిగింది. ఈ వ్యవహారానికి సంబంధించి అప్పటి మెడికల్ సూపరింటెండెంట్, డీఆర్వోను కమిటీ ప్రశ్నించింది. గత వాయిదాకు ఇరువురు హాజరుకాకపోవటంపై తీవ్రంగా మందలించింది. ప్రభుత్వం మారిందనే స్పృహ లేకుండా పనిచేస్తున్నారా అని కమిటీ మండిపడింది.




తీరు మారకుండా ఎమ్మెల్యేల పట్ల అగౌరవంగా ఉంటున్నారని కమిటీకి మాధవీ రెడ్డి ఫిర్యాదు చేశారు. జరిగిన తప్పును అంగీకరించి కమిటీకి నాటి సూపరింటెండెంట్ క్షమాపణలు చెప్పారు. తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే ఈ వ్యవహారంపై పొంతన లేని సమాధానాలు చెప్పిన నాటి డీఆర్వోపై కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోసారి విచారణకు రావాలని ఇరువురునీ ఆదేశించింది. అలాగే 2019-24 మధ్య ఎమ్మెల్యేగా తనకు జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘనలపై జోగేశ్వరరావు ఇచ్చిన ఐదు ఫిర్యాదులపైనా కమిటీ చర్చించింది. ఐదు ఫిర్యాదులపై నాటి అసెంబ్లీ సిబ్బంది నోటీసులు కూడా పంపకపోవటంపై కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. నాటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి తలొగ్గే ప్రోటోకాల్ పాటించలేకపోయామని అధికారులు వివరణ ఇచ్చారు. కమిటీని క్షమాపణలు కోరి, తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు

### మల్కాజిగిరి ప్రాంతంలో

## మరో రియల్టర్ హత్య



**హైదరాబాద్, డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్‌లో పట్టపగలే హత్యలు, దోపిడీలు, దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీలవల పాతబస్తీలో ఓ రియల్టర్ హత్యకు గురయ్యాడు. వరుస హత్యలు, దాడులతో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా మల్కాజిగిరిలో జరిగిన రియల్టర్ హత్య కలకలం రేపింది. సోమవారం ఉదయం మల్కాజిగిలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సాకేత్ కాలనీ ఫోస్టర్ బిల్లాబాంగ్ స్కూల్ సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యారు. వెంకటరత్నం అనే రియల్టర్‌ను దుండగులు అతి కిరాతకంగా హతమార్చారు. స్కూటీపై వెళ్తున్న వెంకటరత్నంను వెంబడించిన గుర్తుతెలియని వెక్తులు.. కత్తులతో పొడిచి తుపాకీతో కాల్చి చంపారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా, వెంకటరత్నంపై ధూల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదై ఉన్నట్లు గుర్తించారు. జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్నట్లు తేలింది. ఆయనను ప్రత్యర్థులే చంపి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# త్వరలో వందేభారత్ స్లీపర్స్

### ప్రారంభానికి ముమ్మరంగా ప్రయత్నాలు

**న్యూఢిల్లీ, డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన .వందే భారత్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు దూసుకెళ్తున్నాయి. త్వరలోనే వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను సైతం పట్టాలెక్కించబోతున్నది. ఈ రైలు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి. తేజస్ రైలు తరహాలో వేగంగా.. రాజధాని రైలు లాంటి సౌకర్యాలు కలిగిన తొలిరైలు ఢిల్లీ-పాట్నా మార్గంలో నడువనున్నది. డిసెంబర్ చివరి నాటికి ఈ రైలు రాకపోకలు సాగించే అవకాశాలున్నాయి. ఈ రైలు ప్రారంభోత్సవానికి సంబంధించిన పనులన్నీ తుది దశలో ఉన్నాయి. ఈ రైలును ప్రారంభోత్సవం కోసం ప్రయాణికులు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నివేదిక ప్రకారం..



బెంగళూరులోని బీఈఎంఎల్, భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో తయారవుతున్న ఈ వందే భారత్ స్లీపర్ రెండు రేక్‌లలో ఒకటి ఇప్పటికే పూర్తయ్యింది. తొలి రేక్ డిసెంబర్ 12న ఉత్తర రైల్వేకు బయలుదేరుతుంది. ఆ తర్వాత ఢిల్లీ-పాట్నా మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈ రైలులో 16 కోచ్‌లు 827 బెర్త్‌లో ఉంటాయి. ఇందులో 611 థర్డ్ ఏసీ, 188 సెకండ్ ఏసీ, 24 ఫస్ట్ ఏసీ బెర్తులు ఉంటాయి. ఈ రైలును అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. రైలులో ఆటోమేటిక్ డోర్లు, బయో టాయిలెట్స్, సీసీటీవీ కెమెరాలు, వ్యక్తిగత రీడింగ్ లైట్లు, ప్రీమియం క్వాలిటీతో సౌకర్యవంతమైన ఇంటీరియర్ ఉంటుంది. ఈ రైలు గంటకు గరిష్టంగా 160 కిలోమీటర్ల వేగంతో నడిచేలా రూపొందించారు. ఇందులో కవచ్ సిస్టమ్, క్రాష్ రెసిస్టెంట్ స్ట్రక్చర్ వంటి అధునాతన భద్రత టెక్నాలజీ అమర్చారు. అవసరమైతే కోచ్ సంఖ్యను 24కు పెంచనున్నారు. ఢిల్లీ-రాజేంద్రనగర్ మార్గంలో తేజస్ మార్గంలో నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. వారంలో ఆరు రోజులు రాకపోకలు సాగిస్తుంది. రైలు సాయంత్రం పట్నా రాజేంద్రనగర్ టెర్మినల్ నుంచి సాయంత్రం బయలుదేరి ఉదయం ఢిల్లీకి చేరుకుంటుంది. తిరిగి తేజస్ రైలు తరహాలోనే నడుస్తుంది. నెలాఖరు నాటికి వందే భారత్ స్లీపర్ రైలును రెగ్యులర్‌గా నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా దానాపూర్ డివిజన్ ధ్రువీకరించింది.

## మావోయిస్టులకు మరో దెబ్బ

### కీలక నేత రాంధేర్‌తో పాటు పలువురు లొంగుబాటు

**రాయ్‌పూర్, డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** మావోయిస్టులకు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో కీలక నాయకుడు, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రాంధేర్ కూడా ఉన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపిన ఎంఎంసీ జోన్‌లో రాంధేర్ కీలకంగా పని చేస్తున్నారు. మావోయిస్టు అగ్రనేత శీర్ఘనేత మిళింద్ తెల్టుంబే మరణించిన తర్వాత ఎంఎంసీ బాధ్యతలన్నీ రాంధేర్ చూసినట్లు పోలీసులు వెల్లడించారు. తాజాగా లొంగిపోయిన రాంధేర్‌పై రూ.3 కోట్ల రివార్డు ఉందని పోలీసులు ప్రకటించారు. రాంధేర్ లొంగుబాటుతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నక్సల్ క్రియాశీలతను గణనీయంగా తగ్గిస్తుందని భద్రతా వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవలి నెలల్లో వివిధ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోతుండటం గమనార్హం. మావోయిస్టు నాయకత్వంలో అంతర్గత విభేదాలు, భద్రతాదళాల ఆపరేషన్ల కఠినతరం, ప్రభుత్వ పునరావాస పథకాలు వంటి పరిణామాలు పెద్ద సంఖ్యలో మావోయిస్టుల లొంగుబాటుకు కారణమైనట్లు అధికారులు అభిప్రాయపడ్డారు.

## గ్లోబల్ సమ్మిట్‌లో రోబో ప్రత్యేక ఆకర్షణ

### సిఎం రేవంత్‌కు ఆహ్వానం పలికిన రోబో

**హైదరాబాద్, డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రారంభమైంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వచ్చిన అతిథులకు స్వాగతం పలకడంతో పాటు గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను అందరికీ వివరిస్తోంది రోబో. ఇక గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా రోబో హాయ్ అంటూ పలకరించింది. తిరిగి ముఖ్యమంత్రి కూడా రోబోకు హాయ్ చెబుతూ ముందుకు సాగారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఈ రోబో అందరినీ ఆకట్టుకుంటోంది. అలాగే గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం పరిశీలించారు. ముఖ్యమంత్రితో సినీ నటుడు నాగార్జున కూడా ఉన్నారు. అతను ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్లోబల్ సమ్మిట్ ఆరంభ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ రంగాలకు చెందిన దేశ, విదేశాల ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ రైజింగ్‌పై ప్రత్యేకంగా రూపొందించిన సాంగ్‌ను వేదికపై ప్రదర్శించారు.

## సిద్ధరామయ్య ఎన్నికపై సవాల్

### నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, డిసెంబర్8(జర్నలిస్ట్ వార్త):** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది . 2023లో వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ కె శంకర అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని సిద్ధరామయ్యను ఆదేశిస్తూ కోర్టు ఇవాళ నోటీసులు జారీచేసింది.కాగా 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధన ప్రకారం సిద్ధరామయ్య అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించాలని పిటిషనర్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దాంతో పిటిషనర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు ఇవాళ సిద్ధరామయ్యకు నోటీసులు జారీచేసింది.ఒకవైపు కర్ణాటకలో సీఎం మార్పుపై ఊహాగానాలు తీవ్ర స్థాయిలో చక్కర్లు కొడుతున్న వేళ సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో డీకే శివకుమార్‌కు ఆర్థిక నేరాల విభాగం నోటీసులు జారీచేసింది.